కథానిక

# పౌరుడు చచ్చిపోయాడు

వి. కె. విశ్వనాథ శర్మ

నా ఇరవై ఒకటో సంవత్సరం పొల్లారా నిండగానే నాకు సంక్రమించిన హక్కు - ఓటు హక్కు - అడల్ట్ ఫ్రాంఛైజ్!

బిడ్డల కోసం గొడ్రాళ్లా, ఈ హక్కు కోసం నేను తపించేను. అందుక్కారణం - దేశ రాజకీయాలు రోజురోజుకీ అధ్వాన్నంగా మారి నాలో అగ్ని జ్వాలలుగా మారటం.

—పదవుల కోసం 'పేదాల' సేవ చేసి, అవి దక్కిన క్షణం నుంచీ స్వార్థ బుద్ధులయిన 'శ్వేత వస్త్రధారులు' నా గుండెల్ని పిండటం.

—దేశ శ్రేయస్సుకు పాటు పడవలసిన ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత కలహాలతో కర్తవ్యాన్ని కాలదన్నటం.

—అన్నిటినీ మించి, ఓటు ముక్కకున్న విలువ తెలుసుకోక, గుడ్డెద్దు చేలో పడ్డట్టు ముద్రకొట్టి చేతులు దులుపుకునే ఓటరును చూపి నాలో వున్న 'అసలు' భారత పౌరుడు విలవిల్లాడి పోయేడు.

నేను గాక, మా ఇంట్లో పోయిన పది సంవత్సరాల నుంచీ పయోజనములుగా చెలామణీ అవుతున్న అమ్మ నాన్న, అన్నయ్యలిద్దరు—

"మీ రొట్టి దద్దమ్మలు. ఏళ్ళు రాగానే సరికాదు హక్కులు రాగానే అయిపోలేదు. మీ హక్కుకున్న విలువ ఏ నాడైనా తెలుసుకోవటానికి ప్రయత్నించేరా? మీకేమైనా విచక్షణా జ్ఞానం వుందా? 'ఓటు వేశామంటే వేశాము. ఏదో భోజనం చేశావా అంటే చేశాము" అన్నట్టు. భోజనం చేసేటప్పుడు కూడా ఆలోచిస్తాం-ఏం తినాలి? ఎంత తినాలి? ఏం తినకూడదూ? తినకూడనివి తింటే కలిగే నష్టమేమిటీ? అని. 'అలా కాదు! ఆకలి అణిచేందుకు కావాల్సింది తిండి. కష్టకాలంలో 'గడ్డి' తినైనా బతకాలి" అంటే అనొచ్చు. కానీ, ఇది ఓటు. పక్షపాతం లేకుండా కులమత విచక్షణ లేకుండా, ఏ ఆశలికి లొంగకుండా స్వతంత్రంగా నిర్భయంగా రేపు నిన్ను ఏలబోయే 'రాజు'ను ఎన్నుకునేందుకు రాజ్యాంగం యిచ్చిన "దివ్వెటీ" అంటూ ప్రతిసారి ఎన్నికలకీ మా వాళ్ళని హెచ్చరిస్తూ వచ్చాను.

కానీ, నాది ఒక రాజకీయ నాయకుడి వుపన్యాసంలా కొట్టి పారేసారు మా

వాళ్ళు చచ్చు వెధవల్ని ఎన్నుకుని చప్పట్లు కొట్టేరు. ఆ చచ్చు వెధవలే తర్వాత తర్వాత చెరణాకోళ్ళు ఝుళి పించి జీవన ప్రమాణపు వెన్నుమీద వాతలు పెడుతుంటే నిస్పృహాయంగా వణికిపోయారు.

వాళ్ళ స్థితి చూసి నాకు నవ్వొచ్చింది జాలేసింది. కోపం లేచింది. ఆవేశం పుట్టింది.

నా పందొమ్మిదో ఏట పుట్టిన ఆ ఆవేశం ఇరవై ఒకటవ ఏటగానీ పుధృత రూపం దాల్చలేదు.

ఓటర్ల లిస్టులో నాపేరు ఎక్కిన తర్వాత నా పుట్టిన రోజు పండుగ జరుపుకున్నాను.

'ఇక నాకు తెలుసు. నా దేశ ఏలు బడి ఎవరి చేతుల్లో పెట్టాలో నాకు తెలుసు. నా ఓటు హక్కును సద్వి నియోగ పరుస్తాను. ధృవతారలాటి నేతను ఎన్నుకుని అభివృద్ధి పధంలోకి సాగిపోతాను' అనివుప్పొంగిపోయాను.

పాలక వర్గంలో అంతః కలహాల వల్లనే గానీ, ప్రతి పక్షాలన్నీ పటిష్ట మవ్వటం వల్లనే గానీ, నాకు ఓటు హక్కు సంక్రమించటం వల్లనేగానీ ప్రస్తుత ప్రభుత్వం కూలిపోయింది మధ్యంతర ఎన్నికలు వచ్చేసాయి. ఎన్నికల సంరంభం ఆకాశవెత్తున సాగుతోంది.

నేను-చెడపుట్టల్లాటి పార్టీల 'మాని ఫెస్టో' లన్నీ చదివేను. అభ్యర్థి వ్యక్తి గత జీవితం, వ్యక్తిత్వ సామర్థ్యం బాగా చదివేను.

ఎన్నికల ప్రచారాలు ఇవాళ్ళతో సమాప్తం.

రేపు లేదు ఎల్లుండే ఎన్నికలు—

x x x

మొన్నటికి ఎల్లుండి ఇవాళే-పోలింగు ఇవాళే.

—మా ఇంట్లో వాళ్ళలాగాక, ఏ వాహనం సహాయం లేకుండానే పోలింగు కేంద్రానికి చేరుకున్నాను. ఎక్కువ రద్దీ లేదు.

వూరట్లాడుతూ నా పేరు చెప్పేను.

లిస్టంతా ఒకటి నాలుగు సార్లు వెతు కుతూ మధ్య మధ్య నా పేరడుగుతూ అన్నాడక్కడి అధికారి "మాస్టారు మీ పేరిక్కడ లేదే. వేరే వార్డుల్లో చూడండి"—

కాళ్ళీడ్చుకుంటూ పక్క వార్డు కెళ్ళేను—

నా పేరు లేదు

ఇంకోటి ... ఇంకోటి ...

సాయంత్రం దాకా తిరిగి తిరిగి విసిగెత్తి పోయింది. నా అసలు వార్డు కొచ్చి అక్కడి అధికార్లతో పోట్లా డినా లాభం లేకపోయింది.

ఇంటి కెళ్ళి అన్నయ్యలతో విష యంచేప్పేను.

వాళ్ళు నవ్వి అన్నారు—"నీ కన్నా మేమే నయం మా ఓట్లు ఎవరో వేసి పారేశారు. మేం వెళ్ళేసరికి. నీ పేరే ఎత్తేశారన్నమాట."

అంతే !

నాలో వున్న స్వతంత్ర భారత పౌరుడు చచ్చిపోయాడు.